# 26. రాజావారి గెడ్డం

కపూర్తలా సంస్థానాధీశులు హిజ్ హైనెస్, జనరల్, మహారాజా జగత్‌జిత్ సింహజీ వారికి మనుమలు లేరు. శ్రీవారి జ్యేష్ఠ పుత్రుడు, యువరాజు పరంజిత్ సింహజీవారికి పుత్ర సంతానం లేదు. పరంజిత్ సింహజీవారి యువరాణి బృంద హిమాలయ సానువుల్లోని జుబాల్ సంస్థానాధీశుల బిడ్డ. ఆమెకు వరుసగా ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారు.

ఇది మహారాజా జగత్‌జిత్ సింహజీ వారి మనోవేదనకు పెద్ద కారణం అయింది. తన కొడుకు తదనంతరం వంశం అంతరించిపోతుం దనే భయం ఒకటి, కష్టపడి నిలబెట్టుకుంటూన్న సంస్థానం పరాయివారి పాలనలోకి పోతుందే అనే భయం మరొకటి.

ఆడ పిల్లలు సింహాసనం ఎక్కేందుకు హిందూ ధర్మసూత్రా లంగీకరించవు. బ్రిటిష్‌వారు రూపొందించి అమలు పరుస్తున్న ఆధునిక నియమాలసలే ఒప్పుకోవు.

ఇలా ఉండగా యువరాణి బృంద నాలుగోసారి గర్భం దాల్చింది. ఆ శుభవేళ మహారాజావారి ఆస్థాన జ్యోతిష్యులు, రాజజ్యోతిష్, పండిట్ శ్రీరామ్ నక్షత్రాలను గుర్తించి, ముహూర్తాలు గుణించి మహారాజా వారికి ఈసారి మనవడుకలుగ బోతున్నాడనీ, కలుగబోయే బాలుడు మహారాజా వారి కీర్తిని, సంస్థానం పరువు ప్రతిష్ఠలను ఆ చంద్రాతార్కరం వర్ధిల్ల జేయనున్నాడనీ బల్లగుద్ది చెప్పారు.

రాజజ్యోతిష్యులవారి మాటకు తిరుగు లేదు!

కనుక......

రాణీవాసం అంతా ఆ కబురు విని ఆనందించేరు. మహారాజావారూ, యువరాజావారూ సంస్థానమంతటా ఆనందోత్సవాలకు ఉత్తర్వులిచ్చేరు. ఖర్చులకుగాను అక్షరాల ఇరవై లక్షల రూపాయలు వెచ్చించేందుకై ఖజానాకు ఉత్తర్వులిచ్చేరు.

ఇదిగాక పుట్టబోయే భవిష్యత్ మహారాజాధిరాజు జననవేళలో ఏలాంటి దుష్టగ్రహాలూ పనిజేయకుండా గ్రహశాంతికై వేదోక్త హోమం జరిపేందుకై రాజజ్యోతిష్యులవారికి మరో పది లక్షలు అందజేశారు.

ఆ పది లక్షలలోనూ అధిక భాగాన్ని దాచుకునేందుకై రాజజ్యోతిష్యుల వారు స్వయంగా కష్టపడి రాత్రివేళల్లో స్వగృహంలో భార్యకుకూడా తెలియకుండా భూగర్భంలో అరలు తయారు చేసుకున్నారు. తెలియనివారు గ్రహశాంతికై ఏకాంతంగా హోమం చేస్తున్నారనుకున్నారు.

యువరాణిబృంద ప్రసవించే శుభదినం రానే వచ్చింది. చరిత్రాత్మకమైన ఆ రోజున తమ ఆనందంలో పాలు పంచుకునేందుకై మహారాజావారు అనేక మంది ప్రముఖులను ప్రత్యక్షంగా ఆహ్వానించేరు ఆలా విచ్చేసిన వారిలో రాచవంశీకులు, మంత్రులు, ఉన్నత ప్రభుత్వోద్యోగులు సేనాపతులు, సర్దార్లు, మతాధిపతులు, వందల సంఖ్యలో రాజాంతపురం వద్ద సమావేశమయేరు.

వీరుగాక పంజాబ్ గవర్నరు, బ్రిటిష్ ఉన్నతోద్యోగులు, ప్రత్యేకంగా బ్రిటిష్ ప్రభుత్వం తరపున పంజాబీ రాష్ట్రాల రెసిడెంటు, మహారాజావారి అనుంగుమిత్రులైన సోదర సంస్థానాధీశులు కూడా హాజరయ్యారు.

వంశోద్ధారకుడు పుట్టీపుట్టగానే రాచసైన్యం అంతఃపురం వద్ద గార్డ్ ఆఫ్ ఆనర్ ఇవ్వవలసిందిగా సర్వసేనాపతికి ఆజ్ఞలు వెళ్ళాయి. 101 తుపాకులు పేల్చబడేందుకు సన్నాహాలు జరిగేయి.

రాచ ప్రాసాదమేగాక మొత్తం నగరం అంతా విద్యుద్దీపాలతో పట్ట పగలులా వెలుగొందసాగింది. రంగు రంగుల దీపాలతో నగరం ఇంద్రలోకంగా మారిపోయింది. ఖరీదైన బాణాసంచాతో కలకత్తా నుండి వచ్చిన నిపుణులు ఆ శుభవేళ కోసం ఎదురు చూస్తున్నారు.

ఎట్టకేలకు ఆ శుభముహూర్తం సమీపించింది. 1926 జూలై 17వ తేదీ తెల్లవారుజామున యూరప్ నుండి ప్రత్యేకంగా పిలిపించబడిన మంత్రసానుల సాయంతో యువరాణి బృంద సుఖంగా ప్రసవించింది.

రాచ నగరులో ఆనందోత్సవాలు వెల్లివిరిసేయి.

శుభ వార్త కోసం వేచి ఉన్న మహారాజా వారికి, వారిని పరివేష్టించి ఉన్న పెద్దలకూ లేడీ డాక్టరు సెరీరా దర్శనమిచ్చింది. సుఖ ప్రసవాన్ని గురించి నివేదించింది.

కానీ... కానీ...

యువరాణి బృంద నాలుగోసారి కూడా ఆడపిల్లనే ప్రసాదించింది కపూర్తలా సంస్థానానికి.

వార్త వింటూనే సభాసదులందరూ స్తబ్ధులయ్యేరు. ఒక్కొక్కరే లేచి అక్కడి నుండి చల్లగా నిష్క్రమించసాగేరు.

మహారాజావారు క్షణకాలం అవాక్కాయి పోయేరు. మరుక్షణం రాజ జ్యోతిష్యుల |వారిని పట్టి చీకటికొట్లో పడేయ వలసిందిగా ఆజ్ఞాపించారు. అతని యావదాస్తులను స్వాధీనం చేసుకోవలసిందిగా గర్జించారు. రాజాస్థానంలోగల ఆతగాడిబందువర్గంలోని వారందర్నీ తక్షణం ఉద్యోగాల్నుండి ఊడబీక వలసిందిగా కూడా హుకుం జారిచేసేరు.

రాజ జ్యోతిష్యుల వారికి ఎలాంటి విచారణా లేకుండా తొమ్మిదేళ్ళ కఠిన కారాగార వాసం విధింపబడింది. మిగిలిన ఆజ్ఞలుకూడా తూచతప్ప కుండా పాటింపబడ్డాయి. సంస్థానం అంతటా 40 రోజులపాటు సంతాపం ప్రకటించ బడింది.

అప్పుడేం జరిగిందంటే :

రాజోద్యోగుల్లోని ఓ ప్రముఖుడికి కల వచ్చింది కలలో పంజాబీ లెల్లరికి పూజ్యుడయిన గురు గోవింద సింగ్ జీ అశ్వారూఢులై ప్రత్యక్ష మయ్యారు.

యువరాజావారు మత సాంప్రదాయాల్ని విస్మరించి క్రాపు చేయించు కొని, నున్నగా గడ్డం గీయించు కుంటున్నారు. అది నేరం, కనుక పుట్ట బోయే మనుమడికి అలా గాకుండా గడ్డం, తల వెంట్రుకలూ కత్తి తగల కుండా పెంచనిస్తానని మహారాజా వారు హామీ యివ్వాలనీ గురు గోవిందుల వారు కలలో అతన్నడిగారు.

ఆ కల వచ్చిన వ్యక్తి సామాన్యుడు గాదు. మన మహారాజా వారికి నమ్మిన బంట్లయిన మంత్రులలో ముఖ్యుడు.

కనుక :

ఆ ఆదేశాలన్నీ తక్షణం గురుద్వారాలో ప్రతిజ్ఞాపూర్వకంగా ఒప్పుకో బడ్డాయి. మహారాజా వారేగాక సంస్థానంలోని సర్వులూ ఆ పవిత్రాదేశా లను పాటించసాగేరు.

పనిలో పనిగా రాజజ్యోతిష్ పండిట్ శ్రీరామ్ వారు సగౌరవంగా బందిఖానా నుండి విడుదలయ్యేరు.

★